క్లుప్తంగా

నేడు 'స్పందన'

బుచ్చిరెడ్డిపాళెం: స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో సోమవారం 'స్పందన' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ ఆదివారం తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి జరిగే ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ పరిధిలోని 20 వార్డుల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం వినతులు సమర్పించవచ్చని తెలిపారు.

బైక్ దహనం

నెల్లూరు(క్రైమ్): ఇంటి పక్కన నిలిపి ఉంచిన బైక్‌ను గుర్తుతెలియని దుండగులు దహనం చేసిన ఘటనపై చిన్నబజార్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. కొండదిబ్బలోని మహాలక్ష్మమ్మ ఆలయ సమీపంలోని ప్రాంతంలో రఫీ నివాసం ఉంటున్నారు. తన బైక్‌ను గుడి పక్కన శనివారం నిలిపారు. ఈ క్రమంలో గుర్తుతెలియని దుండగులు బైక్‌కు నిప్పంటించారు. దీంతో బైక్ పూర్తిగా కాలిపోయింది. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సై సైదులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దాడిపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): దాడి చేస్తుండగా అడ్డుకున్నారనే అక్కసుతో మహిళపై కొందరు దాడికి పాల్పడిన ఘటనపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. ఇందిరమ్మ కాలనీకి చెందిన అనిత మినీబైపాస్‌లోని అనిల్ గార్డెన్స్ సమీపంలో చేపల వ్యాపారం చేసుకొని జీవనం సాగిస్తున్నారు. వరుసకు కుమారుడు శ్రీరామ్ ఆమెతో పాటు వ్యాపారం చేస్తున్నారు. పాత గొడవలను మనస్సులో పెట్టుకొని కొండాయపాళేనికి చెందిన ప్రవీణ్ తన అనుచరులతో వచ్చి శ్రీరామ్‌పై దాడి చేస్తుండగా అనిత అడ్డుకున్నారు. దీంతో ఆగ్రహానికి గురైన నిందితులు ఆమెపై సైతం దాడి చేశారు. గాయపడిన ఆమె జీజీహెచ్‌లో చికిత్స నిమిత్తం చేరారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వివాహిత అదృశ్యం

నెల్లూరు(క్రైమ్): వివాహిత అదృశ్యమైన ఘటనపై సంతపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. కాకర్లవారి వీధికి చెందిన ఓ మహిళ తన భర్తను, పిల్లలను వదిలేసి ఇంటి నుంచి శనివారం వెళ్లిపోయారు. గాలింపు చర్యలు చేపట్టినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు భర్త ఫిర్యాదు చేశారు.

రిక్షా పుల్లర్ మృతి

నెల్లూరు(క్రైమ్): గుర్తుతెలియని రిక్షా పుల్లర్ (60) మృతి చెందిన ఘటన రైల్వేస్టేషన్ వద్ద ఆదివారం చోటు చేసుకుంది. వివరాలు.. రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో నాలుగేళ్లుగా రిక్షా నడుపుకొని రాత్రి వేళ అదే రిక్షాలో సదరు వ్యక్తి నిద్రించేవారు. ఈ క్రమంలో నెల్లూరు రైల్వేస్టేషన్ పడమర వైపున తన రిక్షాలోనే ఆయన మృతి చెందారు. గమనించిన స్థానికులు సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై రాజేష్ ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి వివరాలు లభ్యం కాలేదు. దీంతో మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. స్థానిక వీఆర్వో శ్రీధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతుడి వివరాలు తెలిసిన వారు సంతపేట పోలీసులను సంప్రదించాలని ఆయన కోరారు.

పోక్సో కేసులో నిందితుడి అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): పెళ్లి చేసుకుంటానని బాలికను నమ్మించిన ఘటనలో నిందితుడ్ని చిన్నబజార్ పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. రాజీవ్‌గృహకల్పలో నివాసం ఉంటున్న లక్ష్మి కుమార్తెను అదే ప్రాంతానికి చెందిన షరీఫ్ పెళ్లి పేరిట నమ్మించి మోసగించారు. ఈ మేరకు చిన్నబజార్ ఇన్‌స్పెక్టర్ సురేంద్రబాబుకు బాధితురాలు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు నిందితుడిపై పోక్సో కేసును ఎస్సై లతీఫున్నీసా నమోదు చేశారు. నిందితుడ్ని అతని ఇంటి వద్దే అరెస్ట్ చేశారు.

గిరిజన ఉద్యోగులకు సన్మానం

నెల్లూరు(వేదాయపాళెం): గిరిజన ఉద్యోగులకు రిజర్వేషన్‌ను పది శాతానికి పెంచాలని యానాది గిరిజన ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు కేశవరామ్ కోరారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని కలెక్టర్ చేతుల మీదుగా అవార్డులను అందుకున్న గిరిజన ఉద్యోగులకు అభినందన సభను సుబేదారుపేటలోని వెన్నెలకంటి రాఘవయ్య భవన్‌లో ఆదివారం నిర్వహించారు. అనంతరం గిరిజన ఉద్యోగులను సత్కరించారు. ఉద్యోగ సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు సుబ్బారావు, చెంచయ్య, రాజమౌళి, మురళి, రవీంద్ర, యానాదుల సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పెంచలయ్య, వెంకటేశ్వర్లు, ఉషా, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చండీహోమం



నెల్లూరు(బృందావనం): మాఘ పౌర్ణమిని పురస్కరించుకొని మూలాపేటలోని శంకరమఠంలో చండీహోమాన్ని భక్తిశ్రద్ధలతో ఆదివారం నిర్వహించారు. కంచికామకోటి పీఠానికి చెందిన వేదపండితుడు సోమేశ్వరశర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను జరిపారు. ఉభయకర్తలుగా సాయికుమార్ దంపతులు వ్యవహరించారు. మఠం నిర్వాహకులు నందకిషోర్, ఉషాకుమారి దంపతులు పర్యవేక్షించారు.

రైతులకు అండ

- ఎరువులు, విత్తనాల నాణ్యతకు ఢోకా లేదిక
- అందుబాటులో వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్
- త్వరలో పురుగుమందులు, భూసార పరీక్షలు



కోవూరులోని డాక్టర్ వైఎస్సార్ అగ్రి ల్యాబ్

కొడవలూరు: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోంది. రైతులు కొనుగోలు చేసిన ఎరువులు, విత్తనాలు నాణ్యమైనవా.. కాదా.. అని ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. నియోజకవర్గ స్థాయిలో సమీకృత వ్యవసాయ ప్రయోగశాల అందుబాటులోకి రావడంతో రైతులే స్వయంగా పరీక్ష చేయించుకొని నాణ్యతతో ఉంటేనే వినియోగించవచ్చు. నియోజకవర్గ కేంద్రమైన కోవూరులో డాక్టర్ వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్(సమీకృత వ్యవసాయ ప్రయోగశాల) అందుబాటులో ఉంది. రైతులే స్వయంగా వారు కొనుగోలు చేసిన ఎరువులు, విత్తనాలను ఉచితంగా పరీక్షించుకోవచ్చు. గంటల వ్యవధిలోనే ఫలితాలను రైతులకు తెలుపుతారు.

అన్నదాతలకు ఉపశమనం

రైతులు వినియోగించిన ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు నాసిరకమైనవైతే వారు తీవ్రంగా నష్టపోతుండడం చూస్తూనే ఉంటాం. ఈ సమస్య నుంచి రైతులకు ఉపశమనం కలిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గానికి ఒక అగ్రి టెస్టింగ్ ల్యాబ్ అందుబాటులోకి తెచ్చింది. కోవూరు నియోజకవర్గానికి సంబంధించి కోవూరు ప్రభుత్వాస్పత్రి సమీపంలో ఈ ల్యాబ్ అందుబాటులో ఉంది. ఇక్కడ ప్రస్తుతానికి ఎరువులు, విత్తనాల నాణ్యత పరీక్షించి ఫలితాలను గంటల వ్యవధిలోనే రైతులకు తెలియజేస్తున్నారు. రైతులే స్వయంగా ఇక్కడికి వచ్చి పరీక్షలు చేయించుకోవచ్చు. ప్రస్తుతానికి ఎరువులు, విత్తనాలు మాత్రమే పరీక్షిస్తున్నప్పటికీ త్వరలోనే పురుగుమందులు, భూసార పరీక్షలు కూడా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ల్యాబ్‌ను రైతులు సద్వినియోగం చేసుకుంటే నకిలీల బారి నుంచి బయటపడే అవకాశం ఉంది.

త్వరలో పురుగుమందుల పరీక్షలు



కోవూరులోని అగ్రి ల్యాబ్‌లో ప్రస్తుతానికి ఎరువులు, విత్తనాల నాణ్యతను పరీక్షిస్తున్నాం. త్వరలోనే పురుగుమందుల నాణ్యత పరీక్షలు అందుబాటులోకి రానున్నాయి. వరి కోతలు ప్రారంభమవుతున్నందున రైతులు రెండో పంటకు సంబంధించి ఎరువులు, విత్తనాలపై ఏవైనా అనుమానాలుంటే ఇక్కడ పరీక్షించుకోవచ్చు. నియోజకవర్గంలోని రైతులు ఈ ల్యాబ్‌ను సద్వినియోగం చేసుకోవాలి.

– డి.సుజాత, ఏడీఏ, కోవూరు.

భక్తిశ్రద్ధలతో నాగదేవత విగ్రహ ప్రతిష్ట



ఆలయ ఆవరణలో ప్రతిష్ఠించిన నాగదేవత విగ్రహం

వెంకటాచలం: మండలంలోని కసుపూరు గ్రామంలోనున్న శివాలయంలో జంట నాగులు(నాగదేవత) విగ్రహాన్ని ఆదివారం ప్రతిష్ఠించారు. గ్రామానికి చెందిన వల్లూరు చెంచురామయ్య – సుబ్బరత్నమ్మ దంపతుల దాతృత్వంతో నాగదేవత విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం వేడుకగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

ఈ-క్రాప్‌లో నమోదు తప్పనిసరి

వెంకటాచలం: రైతులు సాగు చేసిన పంటల వివరాలను ఈ-క్రాప్‌లో తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయశాఖాధికారి హరికరుణాకర్‌రెడ్డి సూచించారు. మండలంలోని తిక్కవరప్పాడులో సాగులో ఉన్న పంటలను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు తమ పొలాల్లో సాగు చేసిన పంటల వివరాలను ఈ-క్రాప్‌లో నమోదు చేయించారు. రైతులు తమ భూముల సర్వేనంబర్, ఆధార్‌కార్డు, ఇతర వివరాలు వ్యవసాయశాఖ సిబ్బందికి తెలియజేసి ఈ-క్రాప్‌లో నమోదు చేయించాలని తెలిపారు. ఆయన వెంట వ్యవసాయశాఖ సిబ్బంది ఉన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

కోవూరు: రక్తదానంతో నలుగురి ప్రాణాలను కాపాడవచ్చని సీఐ కె.రామకృష్ణారెడ్డి తెలిపారు. మండలంలోని ఇనమడుగు గ్రామంలో వివేకానంద యువజన సంఘం, రెడ్‌క్రాస్ సహకారంతో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రోడ్లపై ప్రమాదాలు జరిగినపుడు సకాలంలో రక్తం దొరకక అనేక మంది ఇబ్బందులు పడుతున్నారని, యువత స్వచ్ఛందంగా రక్తదానం చేసి బాధితులను ఆదుకోవాలని సూచించారు. రక్తదానం చేస్తే శరీరం బలహీనపడుతుందనే అపోహను వీడాలన్నారు. ఎంపీడీఓ శ్రీహరి మాట్లాడుతూ వివేకానంద యువజన సంఘం అధ్యక్షుడు మారంరెడ్డి వంశీధర్‌రెడ్డి సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడమే కాకుండా ఆలయాల అభివృద్ధికి కూడా కృషి చేయడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై దాసరి వెంకటేశ్వరరావు, పొన్నవోలు సుధీర్‌రెడ్డి, ప్రగతి యువ కేంద్రం చైర్మన్ గునపాటి భూపేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



ఆలయ శంకుస్థాపన పూజల్లో పాల్గొన్న భక్తులు

పొదలకూరు: పట్టణంలోని శ్రీలక్ష్మీ గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఆంజనేయస్వామి ఆలయం నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహణ కమిటీ కార్యదర్శి వాకాటి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ మూడు నెలల్లో నిర్మాణ పనులు పూర్తి చేసి హనుమజ్జంతికి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి వీరేపల్లి శ్రీనివాసులురెడ్డి – చందన దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో నిర్మాణ కమిటీ బాధ్యులు కోనం చినబ్రహ్మయ్య, దేవరం రఘురామిరెడ్డి, ఎం.శ్యాంప్రసాద్‌నాయుడు, కొమ్మి వేణుగోపాల్, దాసరి శ్రీనివాసులు, చొప్పా వెంకటేశ్వర్లు, సన్నికంటి మురళి తదితరులు పాల్గొన్నారు.

బీచ్‌లో సందడి



సముద్ర స్నానాలు చేస్తున్న సందర్శకులు

తోటపల్లిగూడూరు: మండలంలోని కోడూరు బీచ్ ఆదివారం సందర్శకులతో సందడిగా మారింది. సెలవు రోజు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో పర్యాటకులు తరలిరావడంతో కళకళలాడింది. కుటుంబ సమేతంగా విచ్చేసిన సందర్శకులు బీచ్‌లో సేదతీరారు. అలాగే స్నేహితులతో కలిసి వచ్చిన యువతీ యువకులు గంటల కొద్దీ సముద్రస్నానాలు ఆచరించి ఆనందంగా గడిపారు.

మంచు దుప్పటి



ముత్తుకూరు ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో కురిసిన పొగమంచు

ముత్తుకూరు: గత మూడు రోజులుగా తెల్లవారుజాము నుంచి కురుస్తున్న పొగమంచు ఆహ్లాదాన్ని కలిగించింది. ఆదివారం తెల్లవారుజామున విపరీతంగా పొగమంచు కురిసింది. వేకువకు నూతన శోభను తెచ్చింది. సూర్యోదయాన్ని కప్పేసింది. అయితే వాహనదారులు పొగమంచుతో రోడ్లు కనిపించక లైట్ల వెలుగులో ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉదయం 9 గంటల వరకు పొగమంచు వీడలేదు.

పోలేరమ్మకు పొంగళ్లు



పోలేరమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు): విడవలూరు మండలంలోని ముదివర్తి బీసీకాలనీలో పోలేరమ్మ అమ్మవారికి ఆదివారం భక్తులు పొంగళ్లు పొంగించి నైవేద్యాలు సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోలేరమ్మకు ఈ నెల 5వ తేదీ నుంచి మార్చి 7వ తేదీ వరకు ప్రతి ఆదివారం, మంగళవారం పొంగళ్లు, చద్ది కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు భక్తులు తెలిపారు.

ఆదాలకు మద్దతుగా నిలవాలి

కోవూరు: నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి నెల్లూరు రూరల్ ఇన్‌చార్జిగా నియమితులై తొలిసారిగా నగరానికి వస్తున్న సందర్భంగా కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సూచనల మేరకు ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు నెల్లూరులోని అయ్యప్పగుడి వద్దకు చేరుకోవాలని డీసీఎంఎస్ చైర్మన్ డి.నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ పి.రాధాకృష్ణారెడ్డి, మండల కన్వీనర్ ఎన్.సుబ్బారెడ్డి సంయుక్తంగా కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆటో కార్మికుల సంక్షేమమే లక్ష్యం



తోటపల్లిగూడూరు: ఆటో కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఆటో కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ పేర్కొన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని సౌలిపేట సెంటర్‌లో కార్మిక నేతలు ఆటో స్టాండ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.రాజా, సీఐటీయూ మండల గౌరవాధ్యక్షుడు వేగూరు వెంకయ్య, సౌటిపేట ఆటో స్టాండ్ గౌరవాధ్యక్షుడు పచ్చా మధు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకురాలు కాల్తిరెడ్డి రమణమ్మ, నాయకులు నిశిన పరుశురాం, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థిని ప్రతిభ

నెల్లూరు(వేదాయపాళెం): జిల్లా స్థాయిలో నిర్వహించిన ఎమ్మెమ్మీఎస్‌ఈ టాలెంట్ టెస్ట్‌లో వేదాయపాళెంలోని సాయి మహావిద్యాలయ స్కూల్‌కు చెందిన పదో తరగతి విద్యార్థి నిషిత ద్వితీయ స్థానాన్ని సాధించారని కరస్పాండెంట్ నారాయణ తెలిపారు. పురమందిరంలో ఆదివారం నిర్వహించిన ప్రతిభ పురస్కారాల కార్యక్రమంలో విద్యార్థికి అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మాట్లాడారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన పరీక్షకు 150 ప్రైవేట్ స్కూళ్లకు చెందిన ఐదు వేల మంది విద్యార్థులు హాజరుకాగా, నిషిత రెండో స్థానంలో నిలవడం గర్వకారణమని చెప్పారు.

రంగడికి బంగారు గరుడసేవ



నెల్లూరు(బృందావనం): వ్యాస పౌర్ణమిని పురస్కరించుకొని నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో బంగారు గరుడసేవను నేత్రపర్వంగా ఆదివారం నిర్వహించారు. దేవస్థాన ప్రధానార్చకులు జగన్నాథాచార్యులు, సుదర్శనాచార్యులు ఆధ్వర్యంలో పూజలు చేశారు.

వైభవంగా తిరుమంజన వేడుకలు



తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకులు

పొదలకూరు: పట్టణంలోని వెంకయ్యస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామికి మాఘపౌర్ణమి సందర్భంగా ఆదివారం తిరుమంజనం వైభవంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు పాలు, తేనె, పెరుగు, నారికేళం, చందనంతో పాటు పలు సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు కృష్ణమాచార్యులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అలాగే స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం కనులపండువగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణోత్సవాన్ని తిలకించారు. అన్నప్రసాదాలను స్వీకరించారు.

కామాక్షితాయికి ఆభరణాల బహూకరణ



వెండి కవచాన్ని అందజేస్తున్న దాతలు



బంగారు ముక్కుపుడకను అందజేస్తున్న దాతలు

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి అమ్మవారికి పలువురు దాతలు ఆదివారం ఆభరణాలను బహూకరించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యం నాయుడు మాట్లాడుతూ సంగం మండలానికి చెందిన మాలెపాటి చిట్టిబాబు దంపతులు గణపతిస్వామికి 1.557 కేజీల బరువైన వెండి కవచం మరియు 1.453 కేజీల బరువైన వెండి మకరతోరణం మరియు నిత్యాన్నదానానికి రూ.33,001 అందజేశారని తెలిపారు. అలాగే నెల్లూరు రామ్మూర్తినగర్‌కు చెందిన వేమిరెడ్డి ననత్‌కుమార్‌రెడ్డి–పద్మ దంపతులు కామాక్షితాయి అమ్మవారికి 3.550 గ్రాముల బంగారు ముక్కుపుడక ఇచ్చారన్నారు.

కో ఆప్షన్ సభ్యుడికి సన్మానం



బుచ్చిరెడ్డిపాళెం: నగర పంచాయతీ బుచ్చిరెడ్డిపాళెం కోఆప్షన్ సభ్యుడు షేక్ అల్లాభక్షును ఆదివారం వైఎస్సార్‌సీపీ నాయకులు, ముస్లింలు ఘనంగా సన్మానించారు. బుచ్చిరెడ్డిపాళెంలో జరిగిన ఈ కార్యక్రమంలో అల్లాభక్షు మాట్లాడుతూ తనను వైఎస్సార్‌సీపీ కోవూరు నియోజకవర్గ యువజన విభాగం కమిటీ సభ్యుడిగా నియమించిన ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో పార్టీ పటిష్టతకు యువజన విభాగం అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పనిచేస్తానని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సూరా శ్రీనివాసులురెడ్డి, నగర పంచాయతీ వైస్ చైర్‌పర్సన్ షాహుల్, కౌన్సిలర్ రహమత్ పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల పోస్టర్ ఆవిష్కరణ

కోవూరు: కబడ్డీ క్రీడలో కోవూరుకు ప్రత్యేక గుర్తింపు ఉందని డీసీఎంఎస్ చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి అన్నారు. ఈ నెల 10, 11, 12 తేదీల్లో కోవూరులో జరగనున్న కబడ్డీ పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయి ఇన్విటేషన్ కబడ్డీ పోటీలు కోవూరులో జరగడం తమకెంతో గర్వకారణమన్నారు. ఈ పోటీల్లో విశాఖపట్టణం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణ, గుంటూరు, ప్రకాశం, చిత్తూరు, నెల్లూరు జిల్లాల నుంచి జట్లు పాల్గొంటాయని తెలిపారు. కార్యక్రమంలో సీఐ కె.రామకృష్ణారెడ్డి, గౌతమి స్వీట్ అధినేత పనబాక సుధాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చిరంజీవి, కబడ్డీ అసోసియేషన్ సభ్యులు లవకుమార్, జాన్సన్, విజయబాబు, మండల సచివాలయ కన్వీనర్ ప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీ ఆశ్రమంలో సర్వమత ప్రార్థనలు



ఇందుకూరుపేట: మండలంలోని పల్లిపాడులో ఉన్న పినాకిని సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో ఆదివారం సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమ కో కన్వీనర్ నెల్లూరు రవీంద్రరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఆశ్రమంలోని గాంధీజీ, స్థలదాత పొణకా కనకమ్మ విగ్రహాలకు ఖాదీవస్త్రాలు సమర్పించి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆశ్రమ కోర్ కమిటీ సభ్యులు గణేశం దయాకర్‌రెడ్డి, జీవీ రామిరెడ్డి, సర్పంచ్ సుధాకర్, అల్లాభక్షు పాల్గొన్నారు.

పదిలో ఉత్తమ ఫలితాల సాధనకు కృషి



విద్యార్థిని ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు సూచనలిస్తున్న హిందీ పండిట్

కొడవలూరు: పదో తరగతి విద్యార్థులను ఉపాధ్యాయులు దత్తతగా స్వీకరించిన వారు పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. సెలవు రోజుల్లో వారి ఇళ్లకే వెళ్లి తల్లిదండ్రులు, విద్యార్థులకు అవగాహన కల్పించి ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేస్తున్నారు. పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించడంతోపాటు మెరుగైన ఫలితాలు సాధించాలన్న ఉద్దేశంతో విద్యాశాఖ దత్తత విధానానికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగానే గండవరం ఉన్నత పాఠశాల హిందీ పండిట్ నాగభూషణం ఆ పాఠశాలకు చెందిన ఏడుగురు పదో తరగతి విద్యార్థులను దత్తత తీసుకున్నారు. సెలవు రోజుల్లో సమీప గ్రామాల్లోని దత్తత విద్యార్థుల ఇళ్ల సందర్శన చేస్తున్నారు. తల్లిదండ్రులకు విద్య ఆవశ్యకతను వివరించడంతోపాటు ఇంటి వద్ద కూడా చదివించాలని, ప్రతి రోజూ పాఠశాలకు పంపాలని సూచిస్తున్నారు.

పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు



రామన్నపాళెంలో చెత్త తొలగిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

కొడవలూరు: మండలంలోని రామన్నపాళెంలో సర్పంచ్ కాకి ధనమ్మ ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. గ్రామంలో దోమల బెడద ఎక్కువగా ఉందన్న ఫిర్యాదులొస్తున్న నేపథ్యంలో ఇటీవల గ్రామంలో దోమల నివారణకు ఫాగింగ్ చేయించారు. గ్రామంలోని చెత్తా చెదారాలు రోజుల తరబడి ఉంటే పరిస్థితి పునరావృతమవుతుందన్న యోచనతో ఎప్పటికప్పుడు గ్రామంలో రోడ్ల వెంబడి చెత్తాచెదారాలను తీయించేలా చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి డి.సురేష్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకుడు కాకి శ్రీనివాసులు పాల్గొన్నారు.